



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కవిత



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రామారెడ్డి విద్యార్థి

రామారెడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుశనొల్ల ఆకాష్ అండర్-14 విభాగం జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వేణు మాధవ్, పీడీ లింగం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాష్ మధ్యప్రదేశ్‌లోని ఉమారియాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడుతారన్నారు. ఈ మేరకు విద్యార్థిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాలభైరవ స్వామి ఆలయంలో కూష్మాండ దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో శుక్లాష్టమి సందర్భంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రావి చెట్టు వద్ద, ఆలయ ప్రాంగణంలోకూష్మాండ దీపాలను భక్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు స్వామి వారిని అలంకరించి అర్చకులు శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రధాన పార్టీల్లో

బీసీ కుంపటి



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. కోర్టు అడ్డుకున్న నేపథ్యంలో రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఖరారు కాగా పార్టీపరంగా 42 శాతం బీసీ వర్గాలకు సీట్లు కేటాయిస్తామని అధికార కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలకు సంబంధించి పార్టీపరంగా జిల్లాలో ఏయే సర్పంచ్, వార్డు స్థానాలను బీసీలకు కేటాయిస్తామనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

- పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్‌లు ఎలా కల్పిస్తారంటూ ప్రతిపక్షాల నిలదీత
- రిజర్వేషన్లపై ప్రతిపక్షాల దారి ఎటూ?
- జనరల్ స్థానాల్లో సీట్ల కేటాయింపు సవాలుగా మారుతున్న పరిస్థితి
- బీసీ రిజర్వేషన్లపై రాజుకుంటున్న దుమారం

కామారెడ్డి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు సంబంధించి జనరల్ స్థానాల కోసం బీసీ ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించకుండా ఎన్నికలు నిర్వహించడంపై బీఆర్‌ఎస్, బీజేపీ ఇప్పటికే దుమ్మెత్తి పోస్తున్నాయి. తాము 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సాధించే దిశగా చర్యలు చేపడుతామని ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో మీ దారి ఏదని అధికార పార్టీ నేతలు దీటుగా బదులు ఇస్తున్నారు. ఈ లెక్కన ప్రధాన పార్టీల్లో బీసీ కుంపటి రాజుకుంటున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో రిజర్వేషన్‌లు ఇలా..

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 532 సర్పంచ్ స్థానాలు ఉన్నాయి. ఇందులో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న జీపీ 65 స్థానాలు ఎస్టీగా రిజర్వ్ అయ్యాయి. అదేవిధంగా 25 ఎస్టీ రిజర్వేషన్‌లు దక్కాయి. ఎస్సీలకు 79 స్థానాలు, బీసీలకు 123, జనరల్‌గా 240 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. వీటిలో 242 మహిళలకు రిజర్వ్ అయ్యాయి. ఇక జిల్లాలో 4,656 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో 100 శాతం ఎస్టీ జనాభా ఉన్న 498 షెడ్యూల్ కులాలకు రిజర్వ్ అయ్యాయి. 224 ఎస్టీలకు రిజర్వ్ కాగా 732 ఎస్సీలకు, 1,117 బీసీలకు, 2,085 వార్డు స్థానాలు అన్‌రిజర్వ్ అయ్యాయి. వీటిలో 1,995 స్థానాలు మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించారు.

అన్ రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటాపోటీ

అన్ రిజర్వ్‌డ్ గ్రామ పంచాయతీల్లో పోటీ చేసేందుకు జనరల్ అభ్యర్థులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే నామినేషన్‌ల పర్వం మొదలైంది. రెండు రోజులుగా ఆయా సర్పంచ్, వార్డు స్థానాలకు పడుతున్న నామినేషన్లను బట్టిచూస్తే అన్ రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటీ ఎక్కువగా ఉంటున్నట్లు తెలుస్తోంది. అన్ రిజర్వ్‌డ్ ఉన్న ఒక్కో గ్రామపంచాయతీల్లో అధికార పార్టీ నుంచి ఇద్దరు నుంచి నలుగురు స్థానికంగా జనరల్ కేటగిరి నాయకులు పోటీకి సిద్ధం అయ్యారు. వీరిని ఎలా బుజ్జగించి గెలిచే అభ్యర్థిని ఎలా ఎంపిక చేయాలి, మిగిలిన వారిని ఎలా ఒప్పించాలని అని అధికార పార్టీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో బీసీ రిజర్వేషన్ల అంశం అధికార పార్టీ నాయకులు తెరపైకి తేవడంతో ఆయా వర్గాల నుంచి నియోజకవర్గ నాయకులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల చుట్టూ తిరుగుతున్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పార్టీకి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు.

అధికార పార్టీకి దీటుగా ప్రతిపక్షాలు

బీసీలకు సీట్లు కేటాయింపులో అధికార పార్టీపై ఉన్న ఒత్తిడితో పోలిస్తే విపక్షపార్టీలపై అంతగా ఒత్తిడి కనిపించడం లేదు. అధికార పార్టీకి దీటుగా అభ్యర్థులను పోటీకి పెట్టాలని ప్రతిపక్షాలు భావిస్తున్నా గెలిచే సత్తా ఉన్న అభ్యర్థుల కోసం గాలిస్తోంది. అధికార పార్టీ బీసీ రిజర్వేషన్ అమలు చేసే ఆ పార్టీలో జనరల్ ఆశావహుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ నిర్ణయం మేరకు పెద్ద సంఖ్యలో బీసీ అభ్యర్థులను ఎంపిక చేయకపోతే దాని ప్రభావం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో అభ్యర్థిత్వం కోసం ఆశించి భంగపడిన జనరల్ ఆశావహులు కూడా బరిలో ఉండే పరిస్థితులు ఉన్నాయి. పార్టీ నిర్ణయాన్ని (మిగతా 8లో..)

సీఎంకు కామారెడ్డిపై

పట్టింపులేదు

- ముంపు బాధితులకు అందని సాయం
- పెత్తనం చేస్తున్న షబ్బీర్ అలీ
- రెండేళ్లుగా కనిపించని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కామారెడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ మీద చూపిన ప్రేమ కామారెడ్డిపై చూపడం లేదని, రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో కామారెడ్డిలో కూడా పోటీ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలు వచ్చి రెండు నెలలు అవుతున్నా ఏ ఒక్కరికి కూడా నష్టపరిహారం ఇవ్వకుండా రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్‌అలీ స్థానిక ఎమ్మెల్యేను కాదని పెత్తనం చేస్తున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంకట రమణారెడ్డి ఇద్దరు సీఎంలను ఓడించి జాయింట్ కిల్లర్ అయ్యారే తప్ప ఆయన చేసింది ఏమి లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి కాంగ్రెస్ కిందిస్థాయి కార్యకర్తలు బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆ కార్యకర్తలను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యనేతలు కట్టడి చేయాలని కవిత అన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గత రెండేళ్లుగా ప్రజలకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ప్రజల్లో ఉంటేనే వారి సమస్యలు చెప్పుకునే పరిస్థితి ఉంటుందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే పార్టీల నేతలను యువత ప్రశ్నించాలన్నారు. వారు ఏంచేస్తారో మాట తీసుకుని గెలిచాక పనులు చేయకపోతే తాట తీయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నేతలు సంపత్‌గౌడ్, లక్ష్మీనారాయణ, మురళి, ప్రసాద్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ

డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి 8
- రైల్వేట్రాక్‌పై జాగృతి అధ్యక్షురాలు కవిత నిరసన

ఓపెన్ స్కూల్ ఫీజు చెల్లింపునకు అవకాశం


కామారెడ్డి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ ప్రవేశాలకు అపరాధ రుసుంతో వచ్చేనెల 7 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో..

వసతులు నిల్



ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎండలో నిలుచున్న రైతులు




- కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించని అధికారులు
- వసతులు కల్పించినట్లు బిల్లులు వసూలు చేసుకుంటున్న అధికారులు

జుక్కల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం కండేబల్లూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రంలో రైతులకు వసతులు ఏర్పాటు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎండ తగులకుండా టెంట్లు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా రైతులకు హమాలీలకు తాగు నీటి వసతి ఏర్పాటు చేయాలి. ధాన్యం కొనుగోలు ధరల ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ నిబంధనలను ఐకేపీ అధికారులు తుంగలో తొక్కి వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

బినామీ బిల్లులతో నిధులు స్వాహా

ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన తర్వాత రైతులకు నీళ్లు, టెంట్లు ఏర్పాటు చేసినట్లు బినామీ బిల్లులు పెట్టుకుంటారని రైతులు ఆరోపిస్తున్నారు. జుక్కల్ మండలంలో కండెబల్లూరు, కౌలాస్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా జుక్కల్ సొసైటీ ఆధ్వర్యంలో (మిగతా 8లో..)

తాగడానికి నీళ్లు లేవు



• కొమ్ము శ్రీను, హమాలి

జుక్కల్ మండలం కండెబల్లూరు ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐకేపీ సిబ్బంది కొనుగోలు కేంద్రంలో నీళ్ల ఏర్పాటు చేయకపోవడంతో దాహం వేసినా అలిసిపోయి ధాన్యం కాంటా చేస్తున్నామని హమాలీ తెలిపారు. అదేవిధంగా రైతులకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో విశ్రాంతి గది లేకపోవడంతో రైతులు ఎండలో నిల్చుండి అలసిపోతున్నారన్నారు.

టెంట్లు ఏర్పాటు చేయలేదు



• కాజామియా, రైతు

కండెబల్లూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులు ఎండలో నిల్చుండి కాంటాలు పెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విశ్రాంతి తీసుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జిల్లాను కాంగ్రెస్ కంచుకోటగా మారుస్తా

- సామాన్య కార్యకర్తకి దక్కిన గౌరవం
- డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్
- జుక్కల్ బిడ్డకి దక్కిన గుర్తింపు
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావ్





పిట్లంలో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు డీసీసీ, ఎమ్మెల్యే తోటను సన్మానిస్తున్న దృశ్యం

పిట్లం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్‌కి పిట్లంలో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్, కాంగ్రెస్ శ్రేణులు నర్సింగ్ రావ్‌పల్లి క్రాస్‌రోడ్ నుంచి పిట్లం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్లంలో సన్మానసభను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏలే మల్లికార్జున్ నిఖార్సైన కాంగ్రెస్ కార్యకర్త, జిల్లా పార్టీ యంత్రాంగాన్ని నడిపించే సత్తా ఉన్న నాయకుడు అని కొనియాడారు. అంతే కాకుండా కష్టపడ్డ కార్యకర్తలకి పార్టీ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గ ముద్దు బిడ్డ, నిజాంసాగర్‌కి చెందిన ఏలే మల్లిఖార్జున్‌కి డీసీసీ పదవి రావడం మన జుక్కల్‌కే గర్వ కారణం అని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో జుక్కల్‌లో అన్ని స్థానాలని గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్ మాట్లాడుతూ.. నేను డీసీసీ అధ్యక్షుడిగా కావడం, నా లాంటి సామాన్య కార్యకర్తకి లభించిన గౌరవం, గుర్తింపు అని అన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తానన్నారు. కామారెడ్డిని కాంగ్రెస్ కంచు కోటగా మారుస్తా, కార్యకర్తల మనోభావాలకి అనుగుణంగా నడుచుకుంటానని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అందరి నాయకులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ జెండా రెపరెపలాడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుయార్, విండో చైర్మన్ శపథంరెడ్డి, పిట్లం కాంగ్రెస్ పార్టీ మండల అధక్ష్యుడు హన్మాండ్లు, సీనియర్ నాయకులు అడ్వకేట్ రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జుక్కల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- సీసీఐ నిబంధనలను పాటించాలి
- 8 శాతం ఉన్న పత్తికే మద్దతు ధర 7





రాజంపేటలో నామినేషన్ స్వీకరిస్తున్న ఎంపీడీవో

రెండో రోజు 853 నామినేషన్లు

- సర్పంచ్ స్థానాలకు 253
- వార్డు స్థానాలకు 600ల నామినేషన్ల దాఖలు
- నేటితో ముగియనున్న మొదటి విడత నామినేషన్ల పర్వం

కామారెడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నామినేషన్‌ల ప్రక్రియ రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగింది. జిల్లాలోని కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 167 సర్పంచ్, 1520 వార్డు స్థానాలకు గాను నామినేషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే నిర్దేశించిన క్లస్టర్‌ల పరిధిలో 65 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండో రోజు కామారెడ్డి డివిజన్ పరిధిలో సర్పంచ్, వార్డు స్థానాలకు మొత్తం 853 నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. ఇందులో సర్పంచ్ స్థానాలకు 253, వార్డు స్థానాలకు 600ల నామినేషన్‌లు వచ్చాయి. రెండు రోజులు కలుపుకుని సర్పంచ్ స్థానాలకు 368, వార్డు స్థానాలకు 695 నామినేషన్‌లు వచ్చినట్లు పంచాయతీ శాఖాధికారులు తెలిపారు. రామారెడ్డి నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భిక్కనూరు మండలంలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

రెండోవ రోజు వచ్చిన నామినేషన్లు

కామారెడ్డి డివిజన్‌లోని ఆయా మండలాల్లోని సర్పంచ్ వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి రోజు 167 సర్పంచ్ స్థానాలకు 253 నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. అదేవిధంగా (మిగతా 8లో..)



మొండి వీరన్నతండాలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వరి తేమ శాతం ప్రమాణాలకు

అనుగుణంగా ఉండాలి

• కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

రామారెడ్డి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వరి తేమ శాతం ప్రభుత్వ సాధారణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, తూకం, నాణ్యత పరీక్షల్లో పూర్తి పారదర్శకత పాటించాలని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు మరింత సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రామారెడ్డి మండలంలో కలెక్టర్ పర్యటించి గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, వరి కొనుగోలు, గంగమ్మ బ్రిడ్జిని పరిశీలించారు. ముందుగా మండలంలోని మొండి వీరన్న తండాలో కలెక్టర్ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి బరువులు, తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు సరిగా పని చేస్తున్నాయా లేదా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్నారం (మిగతా 8లో..)

విద్యారంగ సమస్యల పరిష్కారంలో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

• ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కామారెడ్డి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దేశంలో రోజురోజుకూ విద్యారంగం పూర్తిగా కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి నిధులు తగ్గిస్తూ సవతి తల్లి ధోరణిని ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. నూతన విద్యా విధానం పేరిట కేంద్రం కార్పొరేటీకరణ పరంచేస్తూ (మిగతా 8లో..)

25 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు : ఎస్పీ

భిక్కనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 25 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం మండలంలోని జంగంపల్లి నామినేషన్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నామినేషన్ కేంద్రం వద్ద పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో శాంతిభద్రతల కోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. 25 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటుగా 5 స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 3 అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల ద్వారా సమగ్ర తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

క్రైం సమాచారం

భర్త చేతిలో భార్య హత్య

ఎడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో భర్త, భార్యను కొట్టగా ఆమె మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమ కథనం ప్రకారం.. మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామానికి చెందిన మొహ్మద్ హుస్సేన్, సుల్తానా బేగం భార్యాభర్తలు. వీరిద్దరికి మద్యం తాగే అలవాటు ఉంది. గురువారం సాయంత్రం మద్యం తాగడానికి సుల్తానా బేగం(50) సమీపంలోని షబానా ఇంటికి వెళ్లి మద్యం తాగుతుండగా.. హుస్సేన్ వచ్చి సుల్తానాతో గొడవపడ్డారు. ఆవేశంతో ఆమె మెడ పట్టుకుని గోడకు మోదడంతో తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లింది. సుల్తానా బేగంను షబానా, హుస్సేన్ ఇద్దరు కలిసి తన ఇంటికి తీసుకు వచ్చి ఇంట్లో పడుకోబెట్టగా అప్పటికే ఆమె మృతిచెందిందని ఆమె కుమారుడు అబ్దుల్ ఖాదర్ తెలిపాడు. ఖాదర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కోటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామానికి చెందిన లక్ష్మి(38) అనే వివాహిత మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. లక్ష్మి గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె భర్త మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ సైతం భారంగా మారింది. గురువారం సాయంత్రం ఇంట్లో భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో లక్ష్మి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి మస్తాన్ గౌండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగిన మైకంలో కిందపడి మృతి

ఎడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట శివారులోని రైల్వే గేటు ప్రాంతంలో తాగిన మైకంలో కిందపడి బోధన్ పట్టణానికి చెందిన బొద్దుల నరేందర్(46) మృతి చెందినట్లు ఎస్సై రమ తెలిపారు. పట్టణంలో పాన్‌గల్లీకి చెందిన నరేందర్‌కు వివాహమై 20 ఏళ్లయినా పిల్లలు కలుగకపోవడంతో అతడి భార్య మూడేళ్ల కిందట వదిలేసి వేరే పెళ్లిచేసుకుంది. అప్పటి నుంచి నేందర్ తాగుడుకు బానిసై ఎక్కడ పనిచేస్తే అక్కడే ఉండేవాడని, గురువారం రాత్రి మద్యం మత్తులో జానకంపేట రైల్వేగేటు వద్ద పడి చనిపోయాడని మృతుడి తమ్ముడి భార్య రజిని తెలిపారని ఎస్సై వివరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్..


పార్వతిబాయి(ఫైల్)

మద్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచూర్ మాజీ సర్పంచ్ పార్వతిబాయి(51) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుండెనొప్పి రావడంతో బిచ్కుంద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు నిజామాబాద్‌కు రెఫర్ చేయగా తరలిస్తుండగా మృతిచెందరన్నారు.పార్వతిబాయి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడు షేక్ అహ్మద్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ, నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి.సాయిసుధ శుక్రవారం తీర్పు వెలువరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ 2020 అక్టోబరు 12న రామ్‌నగర్‌లోని కల్లు బట్టీకి కల్లు తాగడానికి వెళ్లాడు. అక్కడ కల్లు అమ్ముతున్న పున్నమల్ల రాజేష్ గౌడ్‌ను ఉద్దెరకు కల్లు ఇవ్వాలని అడిగాడు. యజమాని గణేష్ గౌడ్ లేరని, నిజామాబాద్ నగరానికి వెళ్లారని, అందువల్ల ఉద్దెర కల్లు ఇవ్వడం కుదరదని రాజేష్‌గౌడ్ తెలిపాడు. దీంతో ఆగ్రహించిన షేక్ అహ్మద్ కల్లు సీసాతో రాజేష్ గౌడ్ ముఖంపై దాడి చేసి గాయపర్చాడు. దీనిపై రురల్ పోలీసులు కేసు నమోదు చేయగా.. కోర్టు విచారణ అనంతరం హత్యాయత్నంగా పరిగణించి జడ్జి పి.సాయిసుధ నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెల్లడించారు.

బ్యాంక్ ఖాతా నుంచి రూ.30 వేలు మాయం

బీర్కూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బానోత్ విజయ్ అనే ట్రాక్టర్ డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.30 వేలు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 20న విజయ్‌కి ఫోన్ పేలో ఓ యాప్ ద్వారా ఒక ఓటీపీ వచ్చింది. దీంతో విజయ్ ఆ ఓటీపీని రద్దు చేశాడు. అనంతరం 21న తిమ్మాపూర్‌లోని మొబైల్ బ్యాకింగ్ కేంద్రానికి వెళ్లాడు. నగదు డ్రా చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని ఖాతాలో డబ్బులు లేవని కేంద్రం నిర్వాహకుడు చెప్పాడు. దీంతో విజయ్ కంగు తిన్నాడు. 25న బీర్కూర్‌లోని యూనియన్ బ్యాంకుకు వచ్చి ఆరా తీయగా.. యూపీఐ నుంచి డబ్బులు తీశారని బ్యాంకు అధికారులు తెలిపారు. తాను యూపీఐ ద్వారా డబ్బులు తీయలేదని బాధితుడు తెలిపాడు. అనం తరం సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


బీఆర్ఎస్‌లో చేరిన వారితో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కమ్మర్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీఏసీఏ డైరెక్టర్ బుర్ర శంకర్ గౌడ్ శుక్రవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి గులాబీ కండువా కప్పుకొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గ్రామీణ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు పాటుపడాలని ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూమన్న, నాయకులు రాజారాం, జూల భూమన్న, రాజేశం, గంగనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులు తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న దృశ్యం

విద్యావికాస్‌లో ఫుడ్ ఫెస్టివల్

బోధన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతకాలం నాటి వంటకాలతో సంపూర్ణం ఆరోగ్యం లభిస్తుందని విద్యావికాస్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్‌లోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థినులు తమ ఇళ్ల వద్ద చేసుకువచ్చిన సంప్రదాయ వంటకాలను పరిశీలించారు. యువత జంక్ ఫుడ్‌లకు అలవాటు పడడంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇతర దేశాలలో సద్ది పెరుగన్నం, పప్పుచారు, పులుసులకు బాగా డిమాండ్ ఉందని కార్యక్రమంలో విద్యావికాస్ విద్యాసంస్థ చైర్మన్ వై.శ్రీనివాస్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పైసలెప్పుడు పడ్తయో..?

» మొక్కజొన్న రైతుల ఖాతాల్లో జమకాని నగదు » 40 రోజులుగా ఎదురుచూపులు » ఏర్గట్ల మండలంలో 33,350 క్వింటాళ్ల కొనుగోలు

ఏర్గట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నను విక్రయించి 40 రోజులైన డబ్బులు జమకాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. యాసంగి సాగుకు అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి సమస్య వివరిస్తున్న ఏర్గట్ల మండల రైతులు (ఫైల్)

మండలంలో ఇలా..

రైతులు కష్టపడి పండించిన మొక్కజొన్నకు తక్కువ దరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేదుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించి వారికి రూ.2400 మద్దతు ధరతో కొనుగోలు చేసింది. మండలకేంద్రంతో పాటు తాళ్లరాంపూర్ సొసైటీల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ మొక్కజొన్నను విక్రయించారు. ఏర్గట్లలో 4,850 క్వింటాళ్లు, తాళ్లరాంపూర్ సొసైటీలో 28,500, మొత్తం 33,350 క్వింటాళ్ల మక్కను కొన్నారు. ఇప్పటికి 40 రోజులు కావస్తున్నా ఒక్క రైతు ఖాతాలో డబ్బులు జమకాక పోవడంతో రైతన్నకు కన్నీరు తప్పడం లేదు. ఇటీవలే తహసీల్దార్ కార్యాలయంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ కోసం వచ్చిన కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డిని రైతులు కలిసి సమస్యను విన్నవించారు.

రైతులకు న్యాయం చేయాలి



తాళ్లరాంపూర్ సొసైటీలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా సంఘ పరిధి గ్రామాల్లోని రైతులు మొక్కజొన్నను విక్రయించారు. ఇప్పటి వరకు రైతు ఖాతాల్లో డబ్బులు వేయడం లేదు. వర్షాకాలంలో భారీగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా రైతులు తీవ్రంగా నష్టపోగా.. చేతికి వచ్చి విక్రయించిన మొక్కజొన్న డబ్బులు రాక రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

- పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్, తాళ్లరాంపూర్

డబ్బులు వెంటనే చెల్లించాలి



మండలంలోని సొసైటీలో మొక్కజొన్న విక్రయించి నెల రోజులకు పైగా అయింది. ఇప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. మూడు ఎకరాల్లో ఎకరానికి 15 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. మద్దతు ధర వస్తుందని సొసైటీలో విక్రయించాను. ఇప్పటికీ డబ్బులు పడలేదు. యాసంగి పెట్టుబడికి నగదు చేతిలో లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న రైతుల డబ్బులు వెంటనే చెల్లించాలి.

- పొదుకూరి మహేష్, రైతు, ఏర్గట్ల మండలం


సాలూరలో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

తప్పిదాలకు తావు ఉండొద్దు

» పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి
» బోధన్ డీఎల్‌పీవో నాగరాజు

సాలూర/కోటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను జరపాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు, సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేసన్ కేంద్రాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. రిజిస్టర్‌లో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా అధికారులు వెంటనే నివృత్తి చేసి నామినేషన్ దాఖలు చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డీఎల్‌పీవో పోతంగల్‌లోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్‌ల ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు అందించారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీవో చందర్, పంచాయతీ కార్యదర్శి యాదవ్ తదితరులు ఉన్నారు.


ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

అధికారులు ఫుల్ బిజీ

ఆలూర్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులు ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. పోలింగ్ కోసం అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, స్టేషనరీ సామగ్రి తదితరాలను సక్రమంగా సిద్ధం చేస్తున్నారు. దీంతో కార్యాలయ పరిసరాల్లో అధికారులు ఫుల్ బిజీ అయ్యారు. ఆలూరు ఆలూరు మండలంలో శుక్రవాఆరం ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో రాజలింగం, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, నవీన్, వందన, దినేష్, తరుణం, నాగేంద్ర, కిషోర్, కారోబార్ సంతోష్, సిబ్బంది ఎన్నికల నిర్వహణ పనుల్లో పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయాలి

జక్రాన్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు తమ హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సూచించారు. మండలంలోని నారాయణపేట్‌లో శుక్రవారం ఎన్నికలపై గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావొద్దన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను బెదిరించడం గుంపులుగా తిరిగి ఉద్రిక్తత సృష్టించి, ప్రత్యర్థులపై దాడులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై జి.మహేష్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వినోద్

నామినేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించండి

జిల్లా ఎన్నికల పరిశీలకుడు కిషన్

మోస్రా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులు నిశితంగా పరిశీలించాలని జిల్లా నోడల్ అధికారి, ఎన్నికల పరిశీలకుడు జే.కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మోస్రా గ్రామ పంచాయతీ నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు వచ్చినా నివృత్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాలకు 100మీటర్ల దూరంలో వాహనాలు ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి నాగనాథ్, అసిస్టెంట్ అధికారి రాజ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగిరి/రెంజల్ : కోటగిరి, పోతంగల్, సాటాపూర్, రెంజల్‌లో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను శుక్రవారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు గుమిగుడకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కేంద్రంలో బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సునీల్, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.


వివరాలు తెలుసుకుంటున్న నోడల్ అధికారి

అభివృద్ధిని జీర్ణించుకోలేక సీఎంపై ఆరోపణలు

» కో ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న పరిపాలన, అభివృద్ధిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మహిళా సంఘాల రుణమాఫీ, ఇందిరమ్మ చీరలపై ఆరోపణలు చేస్తున్నారని కోఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్‌కు సర్పంచ్ అభ్యర్థులు దొరకని పరిస్థితులలో ప్రశాంత్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. 10 ఏళ్ల పాలనలో ఏనాడు మహిళా సంఘాలా రుణాల మాఫీ ఊసెత్తన్ని బీఆర్ఎస్, అప్పుడు బతుకమ్మ చీరలు పంట పొలాల్లో పిట్టల కావలికి పనికి వచ్చాయన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు రుణాలపై వడ్డీ రాయితీ అందజేస్తోందన్నారు. అందిస్తున్న ఇందిరమ్మ చీరలతో మహిళలకు సంతృప్తి చెందుతుంటే.. ప్రశాంత్‌రెడ్డి అది జీర్ణించుకోవడం లేదన్నారు. జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తారన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, పీసీసీ డెలిగేట్ కుంట రమేష్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మానాల

పొగమంచుతో పరేషాన్



పొగమంచు వాహనదారులను పరేషాన్ చేస్తోంది. ఉదయం 9 అయినా మంచు దుప్పటి పల్లెలను కమ్మేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. మంచుతో రహదారులు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై ప్రయాణాలు సాగించే వాహనదారులు, ఉదయం పనులకు వెళ్లే ప్రజలు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డారు. ఇలా రోజూ కొంత మేర ఇబ్బందులు పడుతున్నా పొగమంచుతో ఏర్పడిన ప్రకృతి అందాలను చూసి యువత, చిన్నారులు ఆస్వాదిస్తున్నారు. మంచి దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. - కమ్మర్‌పల్లి

సంక్షిప్త సమాచారం

నాణ్యమైన ఆహారం తీసుకోవాలి

ముప్కాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసిన నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని ఎంపీడీవో జక్కుల రవి కుమార్ సూచించారు. శుక్రవారం ముప్కాల్ మండలంలోని వేంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విషపూరితమైన జంక్ ఫుడ్, రోడ్డు పక్కన కలుషితమైన ఆహారాన్ని తిని అనారోగ్యం పాలు కావద్దని సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులు తయారు చేసిన 200 రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అమ్మ చేసిన వంటకాలు తింటే ఆరోగ్యం బాగుంటుందని ఈసందర్భంగా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ముప్కాల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంగారాం, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాకేష్, హెచ్ఎం సైవ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల డ్రా వాయిదా

ఆర్మూర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని శనివారం నిర్వహించనున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల డ్రాను వాయిదా వేస్తున్నట్లు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నామని, తిరిగి ఎప్పుడు డ్రా తీసేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. మునిసిపల్ పరిధిలోని వివిధ వార్డుల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

క్రీడా దుస్తుల వితరణ

నందిపేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ గీతా కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన శ్రీరామ ఎంటర్ప్రైజెస్ వారు క్రీడా దుస్తులను అందజేశారు. అంతేకాకుండా ఈ నెల 30వ వరకు మెదక్ జిల్లాలోని పటాన్‌చెరులో 44వ జూనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటున్న నిజామాబాద్ క్రీడాకారులకు సైతం దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బిల్లా అనిల్, అధ్యక్షుడు వీపీ భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ అతికుల్లా, కోశాధికారి మధుసుదన్‌రెడ్డి, గీతా కాన్వెంట్ కరస్పాండెంట్ గంగసాగర్, తదితరులున్నారు.

ఐహెచ్ ఐపీ పోర్టల్‌పై అవగాహన

ఆర్మూర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐఎంఈ హాల్‌లో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ ఐహెచ్ ఐపీ పోర్టల్‌పై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతీ ఆసుపత్రిలో ఫార్మసీ, ల్యాబ్‌లలో ఎలా నమోదు చేయాలో సిబ్బందికి వివరించారు. భారత ప్రభుత్వం ద్వారా వచ్చిన ఐహెచ్ ఐపీ పోర్టల్‌లో ఇక నుంచి శిక్షణ పొందిన ప్రతీఒక్కరు రోగుల వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. రోగుల వివరాలు నమోదు చేయడం ద్వారా వ్యాధి గురించి ముందే పసిగట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో రెంజర్ల విద్యార్థిని ప్రతిభ

ముప్కాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ముప్కాల్ మండలం రెంజర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని కే.అంకిత పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఎంఈవో జక్కుల రవి తెలిపారు. ఈ నెల 18 నుంచి 23 తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న 240 ఎగ్జిబిట్స్‌తో పోటీ పడి అంకిత టాప్ 15లో ఎంపికైందన్నారు. ఈ ఫుడ్ ప్రిజర్వేషన్ టాబ్లెట్స్‌కు సంబంధిచిన పేటెంట్స్ హక్కులకు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. గైడ్ టీచర్ మల్లేష్‌ను, విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి శుక్రవారం అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


విద్యార్థిని అంకితను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

భక్తుల కల.. అయ్యప్పకు కోవెల

» ప్రజల సహకారంతో మందిరం అభివృద్ధి » నవీపేటలో నేటి నుంచి ఉత్సవాలు


నవీపేటలో నిర్మించిన ఆలయం

నవీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భక్తుల సహకారంతో అయ్యప్ప ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. రూ.కోట్ల మేర ఖర్చు పెట్టి భక్తులే దేవుడి కోసం పనులకు శంకుస్థాపన చేసుకున్నారు. మండల కేంద్రంలోని బాసర రోడ్డు పక్కన ఉన్న 2013 ఫిబ్రవరి 15వ తేదీన అయ్యప్ప స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించి ప్రారంభించారు. ఇలా కట్టిన ఆలయంలో శనివారం నుం చి కుంభాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయి.



కొలువైన అయ్యప్ప

రూ.కోటి విలువైన భూమి విరాళం..

ఆలయ నిర్మాణం కోసం మండలంలోని శివ తండాకు చెందిన బస్సీనాయక్ అనే ఆర్టీసీ కంట్రోలర్ సుమారు కోటి రూపాయల విలువైన 22గుంటల భూమిని విరాళంగా అందించారు. ఈ ఆలయాన్ని భక్తుల సహకారంతో సుమారు రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించి అభివృద్ధి చేశారు. ఆలయాన్ని నిర్మించిన అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని నిజామాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త మహేష్ అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న చిన్న దేవాలయాలలో గణపతి మందిరాన్ని నవీపేటకు చెందిన వ్యాపారవేత్త పవన్, నాగదేవత మందిరాన్ని నవీపేటకు చెందిన ప్రశాంత్ రెడ్డి, సుబ్రమణ్య స్వామి ఆలయాన్ని నవీపేట మాజీ సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, మాలికా పురోత్తమ దేవి ఆలయాన్ని నవీపేటకు చెందిన వ్యాపార వేత్త బి.వెంకట రత్నం నిర్మించారు. మూడళ్ల క్రితం ఆలయం ఆవరణలో చిత్రగుప్తుడి మందిరాన్ని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు రూ.4లక్షల సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన పలువురు భక్తులు ఆలయ అభివృద్ధికి తమవంతు సహయ, సహకారాలు అందజేశారు. అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

నిర్వహించే కార్యక్రమాలివే..

ఈ నెల 29న మహా గణపతిపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గోపూజ, ధ్వజారోహణం, యాగశాల సంస్కరణ, నవగ్రహ మండప దేవత కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, లక్ష్మి గణపతి హోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, 30న గణపతి పూజ, పుణ్యాహవచనం, మండప దేవత పూజ, సామూహిక హోమం, సుదర్శన హోమం, సహస్ర కలశ స్థాపన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదన వితరణ, అదే రోజు సాయంత్రం 6గంటలకు భక్త మార్కండేయ ఆలయం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వా మి ఊరేగింపు నిర్వహించనున్నారు. చివరి రోజైన సో మవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, హవహిత మండప పూజ, అయ్యప్ప స్వామి సహిత పరివార దేవతల, శిఖర, ధ్వజాస్తంభ, దేవిదేవతల సహస్ర కలశాభిషేకం(మహ కుంభాభిషేకం), లక్ష పుష్పార్చన, బలిప్రదానం, మహపూర్ణాహుతి, అన్నదానం చేపట్టనున్నారు.



గీ ఎలచ్చన్‌లలో మంచోళ్లని గెలిపిద్దాం

రచ్చబండ ముచ్చట్లు

భీమ్‌గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామంలో సర్పంచ్ ఎన్నికలపై అన్ని గ్రామాల్లో రచ్చబండ ముచ్చట్లు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఓ గ్రామంలో రచ్చ బండ ముచ్చట్లు.

రామన్న: ఓ శీనన్న, గంగన్న ఎటు పోతున్నారే.. ఇటు రండి పోదురుగాని

శీనన్న: ఎటు లేదే రామన్న పొలం కాడ నారు పోసిన చూసి రాన పోతున్న. చెప్పు ఏమిటి విషయం.

రామన్న: ఏమున్నది శీనన్న ఈ ప్రభుత్వం సర్పంచ్ ఎలచ్చన్ పెడుతోందట.. మరి ఎట్లా ఈ సారి ఓటు ఎవరికి వేద్దాం!

శీనన్న: అవునే రామన్న ఎలచ్చన్లు ఉన్నాయట మరి ఈ సారి మన ఊరిని బాగు చేసేటోళ్లకు ఓటేద్దామే, ఏమంటావే గంగన్న

గంగన్న: అవునే శీనన్న.. రామన్న మన ఊరిని బాగు చేసేటోనికి మంచిగా చదువుకున్నోళ్లకు ఓటేసి గెలిపిద్దాము.

రామన్న: ఆ ఏమ్రా.. కిషన్! ఎప్పుడు వస్తున్నావురా. అంత మంచిదేనా.. దుబాయ్ నుంచి ఇంత తొందరగా వచ్చినావ్ ఏంది!

కిషన్: అవునే రామన్న, శీనన్న, గంగన్న ఇప్పుడు వచ్చిన బస్సుకు వస్తున్ననే తొందరగా వచ్చినా, ఇక్కడ సర్పంచ్ ఎలక్షన్లు ఉన్నాయి కదా అందుకనే వచ్చిన ఇక ఇంటి వద్దకు పోయోస్తా

శీనన్న: అవునే రామన్న ఈ కిషన్ గాడు దుబాయ్ పోయింది మొన్ననే ఇప్పుడు గీ సర్పంచ్ ఎలచ్చన్లు అనగానే వచ్చిండు పోటీ చేస్తాడేమో

గంగన్న: లేదే రామన్న.. కిషన్ గాడు సర్పంచ్, ఎంపీటీసీ ఎలచ్చన్లు ఉంటే దుబాయ్ నుంచి వస్తాడు. వాడు పోటీ చేయడు కానీ మన ఊరు వాళ్లందరికీ అభివృద్ధి చేసేటు వంటి వారికి ఓటు వేద్దామని ప్రజల్లో చైతన్యం తెస్తాడు.

రామన్న: అవునే అన్నలు గిట్లాంటి పిల్లగాండ్లు ఉంటే మనం కూడా వాళ్లకు కొంచెం సపోర్ట్ చేద్దామే. ఎందుకంటే మంచోళ్ళని సర్పంచ్ గెలిపించుకుంటే మన ఊరే బాగుపడ్తది.

శీనన్న: ఇంకా ఏం సంగతి రామన్న, గంగన్న కోతలు అయిపోయినాయా, వడ్లు పోయాయా

గంగన్న: అయినయే శీనన్న ఆటో పోయినాయి పైసలు కూడా వచ్చినాయి. ఈ సారి ఏందో గాని బోనస్ పైసలు కూడా జల్ది వచ్చినయ్.

శీనన్న: రామన్న, గంగన్న పొలం కాడా నారు పోసిన జర పని ఉన్నది. పొలం దాకా పోయి వస్తా. ఏదేమైనా ఈ త్యాప పైసలు పంచే టోళ్లని కాకుండా పనిచేసేటోన్ని గెలిపించుకుందామే.

అందరిమాట ఒక్కటే

రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా సిరినా బలరాం



సిరినా బలరాంను తీర్మానించిన దృశ్యం

వర్ని/నాగిరెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేయడానికి స్థానిక నేతలు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లోని మెజారిటీ వర్గాలతో తీర్మానం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం రూప్లా నాయక్ తండా సర్పంచ్‌గా సిరినా బలరాంను శుక్రవారం గ్రామస్థులంతా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానించారు.



మాసానిపల్లి సర్పంచ్‌గా సునంద

నాగిరెడ్డిపేట మండలంలోని మాసానిపల్లి సర్పంచ్ పెద్దపట్లోల్ల సునందతో పాటు 8వ వార్డు సభ్యులందరినీ గ్రామస్థులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానించారు.

సామాజిక న్యాయం, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిజామాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడటమే జ్యోతిబాఫూలేకు మనమిచ్చే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ దేశంలో వివక్షత, అంటరానితనం రూపుమాపేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాలను చైతన్యవంతం చేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలో మహిళల పట్ల చులకన భావం, వివక్షత పోవాలంటే చదువు ద్వారా విజ్ఞానవంతులను చేయ వచ్చన్నారు. వివక్షతకు వ్యతిరేకంగా సావిత్రిబాయి పూలే పోరాటాలు చేశారన్నారు. నేటి పాలకులు బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలులో తమ ఆధిపత్య ధోరణి పోతుందని దాటవేస్తున్నారని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాడినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని రమేష్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులునూర్జహాన్, శంకర్ గౌడ్, నాగరాజు, సుజాత, విగ్నేష్, వై.గంగాధర్, అనిత, చక్రి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలేకు కాంగ్రెస్ నాయకుల నివాళులు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు గోవిందరావు పూలే వర్ధంతి సందర్భంగా నగరంలోని హనుమాన్ జంక్షన్‌లోని పులే విగ్రహానికి కాంగ్రెస్ ఓబీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజనరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహనీయుల్లో మహాత్మా జ్యోతిరావు పూలే ఒకరని, సమాజంలో అణగారిన వర్గాల అక్షరాస్యత, సమానత్వం, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన ఆయన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం అన్నారు.

కుల వ్యవస్థను శాస్త్రీయంగా విశ్లేషించిన తత్వవేత్త ..

సిరికొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థను శాస్త్రీయంగా విశ్లేషించి అమానుషతను బహిర్గతం చేసిన తొలి సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య అన్నారు. సిరికొండలో మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సహచర ఉపాధ్యాయులతో కలిసి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. సమాజంలోని అన్యాయాలను ఎదిరించడానికి విద్యనే ఆయుధంగా ఎంచుకుని అస్పృశ్యత, మహిళలపై వివక్షతను రూపుమాపడానికి పాఠశాలలను ఏర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు. పూలే సావిత్రీబాయి దంపతులు ప్రారంభించిన బాలిక విద్యోద్యమం భారత విద్యా చరిత్రలోనే అతిపెద్ద సామాజిక పునర్నిర్మాణ ఉద్యమమని నర్సయ్య గుర్తు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, సామాజిక అవగాహన క్విజ్ పోటీల విజేతలకు నర్సయ్య బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా విద్యను ప్రోత్సహించిన మహనీయుడు..

సుభాష్‌నగర్: మహిళా విద్యను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిబా పూలే అని బీసీ సంక్షేమ సంఘం నరాల సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లో గల విగ్రహాల పార్కు వద్ద జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే కేవలం బడుగు బలహీన వర్గాలకే సేవచేయలేదని గుర్తు చేశారు. సమాజంలో వెనకబడిన ప్రతీ ఒక్కరి గురించి పోరాడిన నాయకుడు మహాత్మ జ్యోతిబా పూలే అన్నారు. అగ్ర వర్ణాల పేదలకు, వితంతువుల కొరకు పోరాడిన ఏకైక వ్యక్తి మహాత్మజ్యోతిబాపూలే అని గుర్తుచేశారు. భార్యకు విద్యనేర్పి భారతదేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనీకుడు అన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

జ్యోతిబాపూలే చూపించిన సమానత్వమార్గంలో నడవాలని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఏఐపీఎస్‌యూ, ఆర్‌ఎస్‌పి, ఆర్‌వైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించారు.

పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

» నాణ్యమైన పత్తికే గిట్టుబాటు ధర » నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా నష్టం



మద్నూర్ మార్కెట్‌కు వచ్చిన పత్తి

మద్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వాతావరణంలో అతివృష్టి, అనావృష్టి వల్ల పత్తి దిగుబడి అం తంత మాత్రమే వచ్చింది. వచ్చిన కాస్త పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు ధరకు లభిస్తుంది. ఈ విషయంలో రైతులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. చేను లో పత్తి పూర్తిగా విచ్చుకొని ఆరి న తర్వాత ఏమాత్రం తేమాలేని సమయంలో పత్తిని ఏరాలి. తర్వాత నీడలో ఒకటి రెండు రోజు లు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తర్వాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గాని నిలువ చేయడం వల్ల ఎ లాంటి తేమ పెరగదు. చేనులో పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టు మీదనే పూర్తిగా ఆరేలా చూ డాలి. ఆ తరువాత పత్తి తీయాలి. ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. నీటిని కలపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒక టి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధర పొందవచ్చు. పత్తిని ఉదయం సాయంత్రం సమయంలో కాకుండా కొద్ది గా ఎండ ఉన్న సమయంలో తీయాలి. ఎలాంటి పత్తిని తీయాలనే విషయంలో కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడాలి. వేరువేరుగా మార్కెట్ కు తీసుకురావాలి. వివిధ రకాలైన పత్తిని కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆ రకం మార్కెట్‌కు తీసుకువెళ్లాలి.

పత్తిలో తేమ శాతం మద్దతు ధర
8 శాతం తేమ ఉన్నట్లయితే రూ. 8,110
9 శాతం ఉన్నట్లయితే రూ.8028
10 శాతం ఉన్నట్లయితే రూ.7,947
11 శాతం ఉన్నట్లయితే రూ.7,866
12 శాతం ఉన్నట్లయితే రూ.7,785

తేమ శాతం ముఖ్యం

పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8 శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమశాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెల రూపంలో చూపిస్తుంది. తేమ విషయంలో కొంత సడలింపు ఇవ్వాలని రైతుల పక్షనా కాటన్ అసోసియేన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదేవిధంగా ఎనిమిది నుంచి 12 వరకు తేమ శాతం ఉన్న పత్తిని సిసిఐ కొనుగోలు చేస్తుంది. అలా కాకుండా 12 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షానా కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

సీసీఐ నిబంధనలు ఇవే

నాణ్యతలేని, రంగు మారిన, వర్షానికి తడిసిన పత్తిని సిసిఐ కొనుగోలు చేయదు. పత్తి రైతులందరూ సంబంధిత ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పత్తి రైతులకు చెల్లింపు నేరుగా వారి ఆధార్ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలోకి మాత్రమే జమ చేస్తుంది. అందువల్ల పత్తి రైతులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్ లింకు చేసుకోవాలి.

సీనియర్ తెలుగు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



వేల్పూర్‌లో కాంప్లెక్స్ హెచ్ఎం రాజన్నకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వేల్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 2010 కన్న ముందు ఉన్న సీనియర్ తెలుగు ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని వేల్పూర్, భీమ్‌గల్ కాంప్లెక్స్ పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు శుక్రవారం వేల్పూర్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజన్నకు వినతి పత్రం అందజేశారు. ఎవరి విషయాల వారిగా వారు వారి సబ్జెక్టును ఎక్కువ మార్కులు కేటాయించి పేపర్లు తయారు చేయాలని పేర్కొన్నారు. అందరికి సీనియర్ ఉపాధ్యాయులకు ప్రతీ పేపర్‌లో పాస్ మార్కులు 40 పరిగణించి పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి వీణ, బాగ్యలక్ష్మీ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల సీనియర్ తెలుగు ఉపాధ్యాయులు సీహెచ్ కాంతయ్య, శ్రీనివాస్, ధర్మపురి, తిరుపతి, సాగర్, రాములు, మారుతి, రమాదేవి, గోదావరి, విజయలక్ష్మీ, శ్యామ్ చరణ్, వినోద శ్రీ, సుమలత, వసంతరాణి, తదితరులున్నారు.

ఆది మల్లన్న స్వామికి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు



పడిగెల ఆదిమల్లన్న స్వామికి నైవేద్యాలతో బారులు తీరిన మహిళలు

వేల్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో ఆది మల్లన్న స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆది మల్లన్నకు నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఉదయం నుంచి ఆలయం వద్ద నైవే ద్యాలతో బారులు తీరి మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో బాలకిషన్, పంచాయతీ కార్యదర్శి సజన్ కుమార్‌లు ఆదిమల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మానాల మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన హనుమాన్‌తండా యువకులు



యువకులకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మానాల

కమ్మర్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగా మండలం మానాల అనుబంధ గ్రామం హనుమాన్ తండాకు చెందిన పలువురు యువకులు శుక్రవారం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీనుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ ఖండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామీణ స్థా యి నుంచి పార్టీని బలోపేతం చేస్తు ప్రభుత్వం అదంజేస్తున్న పథకాలను ప్రజల కు వివరిస్తు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులను స ర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్, తూం జలపతి, తదితర నాయకులు పాల్గొన్నారు.

టీయూకు రూ.200 కోట్ల నిధులు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూ నివర్సిటీకి రూ.200 కోట్ల నిధులు విడుదల చేయాలని పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.అనిల్‌కుమార్ అన్నారు. డిచ్‌పల్లిలోని టీయూ యూనివర్సిటిలో శుక్రవారం లా కాలేజ్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటిలోని ప్రధాన క్యాంపస్‌ల కోసం రూ. 200 కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా వసతి గృహాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన సైన్స్ కళాశాల భవనాన్ని ప్రారంభించాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీ మసక బారేల ఇటీవల అనేక పరిణామాలు జరిగాయన్నారు. ఇకనైనా వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లు యూనివర్సిటిలో అకాడమిక్ వాతావరణాన్ని పెంపొందించేలా చర్యలు తీసు కోవాలన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల పరిరక్షణ కోసం పీడీఎస్‌యూ రాజీలేకుండా పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు నితిన్, చరణ్, నగేష్, దేవి, నిఖిత, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. 8వ రోజు జరిగిన పరీక్షల్లో ఉదయం జరిగిన పరీక్షలకు 2199 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2037 మంది విద్యార్థులు హాజరయ్యారని 161 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 4775 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4544 మంది వి ద్యార్థులు హాజరయ్యారని 230 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డిబార్ అయినట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

» మొదటి స్థానం దక్కించుకున్న ఖమ్మం, నిజామాబాద్ జట్లు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మూడు రోజులుగా కన్నులపండవగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు హాజరైన జిల్లా విద్యాధికారి శారద జిల్లా యువజన క్రీడ అధికారి ఏ సురేష్‌తోకలిసి విజేతలకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు శారీర ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 244మంది ఈ టోర్నీలో పోటీపడగా లీగ్, సెమీ ఫైనల్స్ అనంతరం ఆరు జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచుల్లో బాలుర విభాగంలో ఖమ్మం జట్టు మొదటిస్థానం సాధించగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో రెండో స్థానంలో వరంగల్ జట్టు సాధించగా మూడవస్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రెండవ స్థానం మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సాధించగా మూడో స్థానాన్ని కరీంనగర్ జట్టు దక్కించుకుంది. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల నిర్వాహణకు కృషిచేసిన ధర్మారం మండల విద్యాధికారి పి. ప్రభాకర్‌ను, టోర్నమెంట్ ఆర్గనైజర్ బైకని కొమురయ్యను ముఖ్యఅతిథులు అభినందించారు. కార్యక్రమంలో ఏఎంవో షేక్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తమ్ముడు రాజయ్య, ప్రిన్సిపాల్ విద్యాసాగర్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు తన్నీరు రాజేందర్, ఇప్ప మల్లేశం, రవీందర్ శెట్టి, గిన్నె లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేల్పుల సురేందర్, దాసరి రమేష్, టి. సౌజన్య, కుమార్, మమత పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా సాయాగౌడ్



నసురుల్లాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా శుక్రవారం మంతపురి సా యా గౌడ్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి, తనను గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సాయాగౌడ్‌ను గ్రామస్థులు శాలువాతో సత్కరించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

» డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పోచారం భాస్కర్ రెడ్డి

బీర్కూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో కాం గ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. శుక్రవారం బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జోగు నర్సింలు, పందుల సుధాకర్, గుడికొండ సాయిలు, కొండు పండరి, తుకారాం, కమ్మరి బాబు, దుర్గయ్య, హన్మాండ్లు, కొండ్ర రాములు, పోతురాజు రాజు, నిరుడి రాజు, లస్మాపురం దశరథ్‌లతో పాటు కార్యకర్తలు పెద్దఎత్తున భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సం క్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికాంత్, బసవరాజు, రాములు, దుంపల రాజు, రఘు, మొగలు గోండ, విజయ్, నారాయణ, లక్ష్మయ్య, పండరి పటేల్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా ట్రస్టుకు విరాళం



అయ్యప్ప దీక్ష గురుస్వాములకు విరాళం అందజేస్తున్న భక్తులు

బాన్సువాడటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అయ్యప్ప నిత్యాన్నదాన సేవా ట్రస్టుకు శుక్రవారం దాతలు విరాళాలను అందజేశారు. శ్రవణ్‌కుమార్ 11,116 రూపాయలు విరాళం, స్వరూప అన్నప్రసాద వితరణ కోసం 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా బెజుగం శంకర్ మాట్లాడుతూ దాతల సహకారంతో బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదాన యజ్ఞం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, తాటి ప్రశాంత్, చిదుర సుధాకర్, చిదుర సురేందర్, ఉడుగుల సంజీవ్ కుమార్, చిదుర సచిన్ తదితరులున్నారు.


ప్రభుత్వ ముఖ్య సలహాదారును కలిసిన రెడ్డి ఐక్య వేదిక నాయకులు

పేద రెడ్ల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

» రెడ్డి ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రెడ్డి

కామారెడ్డిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద రెడ్ల కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని రెడ్డి ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డిని పలువురు రెడ్డి నాయకులతో పాటు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరెడ్డి సామాజిక వర్గం కోసం జరుగుతున్న పోరాటంతో త్వరలోనే రెడ్ల కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు పేదరికంలో ఉన్నారని ఆయా వర్గాలకు ప్రభుత్వం నుంచి కావచ్చని వారికి ప్రత్యేక కార్పొరేషన్ గాని ఏర్పాటు చేసి ఆ వర్గాలకు ఆర్థికంగా సహాయసహకారాలు అందుతున్నాయని కాని ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వాలు అగ్రవర్ణాల పేదలకు ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన వెంటనే కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చిందని ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధతతో కూడిన కార్పొరేషన్ త్వరలో ఏర్పాటుచేసేందుకు కృషిచేయాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సుమన్‌రెడ్డి, జేఏసీ చైర్మ న్ వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి జైపాల్ రెడ్డి,నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య సంస్మరణ దినోత్సవం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


లింగంపేట్‌లో కానిస్టేబుల్ కిష్టయ్య సంస్మరణ దినోత్సవం గోడపత్రులు ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

లింగంపేట, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య సంస్మరణ దినోత్సవం గోడ ప్రతులను ముదిరాజ్‌లు లింగంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ఆవిష్కరించారు. రాష్ట్రం కోసం ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య సంస్మరణ సభను డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రి వద్ద నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సభకు మండలంలోని ముదిరాజ్‌లు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు అశోక్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతి కుమార్, సాయికుమార్, బాలయ్య, రమేష్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత నడుం బిగించాలి


స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాదవక ద్రవ్యాల నిర్మూలనకు యువత నడుం బిగించాలని ఉదయ్ చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉదయ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నశా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. యువతే దేశానికి పునాది అని యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాన్ని అందకారం చేసుకోవద్దన్నారు. కామారెడ్డి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లా మార్చేందుకు ప్రతిజ్ఞ్కరు బాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ సిబ్బంది చరణ్, గ్రామస్థులు బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాల్వంచలో స్వయం పాలన దినోత్సవం

పాల్వంచ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయలుగా మారి విధులు నిర్వహించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా ఎంఈవో రాంమనోహర్ రావు మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు నాగేందర్, మహిపాల్, అర్చన, సుప్రియ, దర్శీ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుల బాధ భరించలేక ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లి గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిట్టబోయిన అంజయ్య(42) చేసిన అప్పులు తీర్చలేక బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గ్రామశివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడికి జైలు

కామారెడ్డి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):అజాగ్రత్తగా వాహనం నడిపి వ్యక్తి మరణానికి కారణమైన నిందితునికి బిచ్కుంద న్యాయమూర్తి వినీల్‌కుమార్ 3 నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జుక్కల్ మండలంలోని కండెబల్లూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట నాగయ్య2017 ఆగస్టు 14 న గ్రామం నుంచి జుక్కల్ గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా మహమ్మద్ షామిమ్ అనే వ్యక్తి కారుతో అతివేగంగా,అజాగ్రత్తగా వాహనం నడుపుతూ నాగయ్యను ఢీకొనడంతో బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. వైద్యులు పరిశీలించిఅప్పటికే నాగయ్య మృతిచెందాడని తెలిపారని దీంతో మృతుని కుమారుడు పరమేష్ జుక్కల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి కోర్టులో అభియోగ పత్రం వేసినట్లు తెలిపారు. విచారణ జరిపిన న్యాయమూర్తి శిక్షను ఖరారుచేసినట్లు వివరించారు.

నర్వలో వాహనాల తనిఖీ

మహమ్మద్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ గేటు వద్ద గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్ల యింగ్ స్క్వాడ్ అధికారులు ఆర్ఐ సాయిలు, కానిస్టేబుల్ హరిచంద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎవరూ కూడా రూ.50వేల కంటే ఎక్కువగా డబ్బులను వెంట పెట్టుకోవద్దన్నారు. మద్యాన్ని, డబ్బును తరలిస్తే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

» బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

» రైల్వేట్రాక్‌పై జాగృతి అధ్యక్షురాలు కవిత నిరసన


కవితను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కామారెడ్డి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ గేట్ వద్ద జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రైల్‌రోకో నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించిన అనంతరం అశోక్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి అక్కడి నుంచి ఆకస్మాత్తుగా రైల్వేట్రాక్‌పైకి జాగృతి నాయకులు, కార్యకర్తలతో వచ్చి కూర్చుని నిరసన తెలిపారు. అరగంట పాటు నిరసన వ్యక్తం చేయడంతో ఏఎస్పీ చైతన్యరెడ్డి వచ్చి కవితను నిరసన విరమించాలని రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా కవిత అక్కడి నుంచి కదలకపోవడంతో ఆమెను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయడంతో జాగృతి నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. చివరకు కవితను అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించడంతో పాటు జాగృతి నాయకులను దేవునిపల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. కవిత నిరసన తెలుపుతున్న సమయంలో నిజామాబాద్ నుంచి వస్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను ఇందల్‌వాయి వద్ద, నిజామాబాద్ వైపువెళ్తున్న గూడ్స్ రైలును కామారెడ్డిలో రైల్వే అధికారులు ఆపి వేశారు. రైల్వేట్రాక్‌పై నిరసన తెలిపి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించినందుకు గాను కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

హెచ్‌వీఆర్ అవార్డుకు ఎంపికైన సరస్వతి శిశు మందిర్ పాఠశాల


కలెక్టర్ చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న పాఠశాల నిర్వాహకులు

కామారెడ్డి టౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ ఈవం హరిత్ విద్యాలయ రేటింగ్ అవార్డుకు సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఎంపికైందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ చేతుల మీదుగా అవార్డుకు సం బంధించిన ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం పాల్గొన్నారు.

జీరో అకౌంట్లతో ఇబ్బంది పడుతున్న ఆశావహులు

తాడ్వాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు జీరో అకౌంట్ తప్పనిసరి అని నిబంధన ఉన్నప్పటికీ పోటీ చేసే అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఉన్న బ్యాంకులు తాడ్వాయి ఎర్ర పహాడ్ బ్యాంకులలో జీరో ఖాతాలు ఇవ్వడం లేదని అంటున్నారు. జీరో ఖాతాలు ఇవ్వకపోతే స్క్రూట్నీలో పోతామని ఆందోళన చెందుతున్నారు. జీరో ఖాతాలతో ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రజ్యోతి విలేకరి ఎలక్షన్ అధికారిని అడుగగా అభ్యర్థికి ఉన్న ఖాతాను జీరో ఖాతాగా మార్చి మార్చిన బ్యాంక్ అకౌంట్ స్టేట్మెంట్ తో ఒక సొంత పూచికత్తుతో రాసి ఇస్తే సరిపోతుందని ఎలక్షన్ అధికారులు అన్నారు. ఆశావాకులకు తాడువాయిలో జీరో ఖాతా ఇప్పించాలని అంటున్నారు.

గురుకులాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎస్టీ, ఎస్సీ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందని మండల వైద్యాధికారి శరత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యఆరోగ్య శాఖ సూచనల మేరకు సాధారణ రుగ్మతలు ఉన్న గురుకుల విద్యార్థులకు వైద్య పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశామన్నారు. హాస్టల్ వంటగది శుభ్రత, ఆరోగ్య విద్యపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చలి ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఠాగూర్, సబ్ యూనిట్ అధికారి గోవిందరెడ్డి, పర్యావేక్ష అధికారి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన లింగంపేట బాలుర పాఠశాల విద్యార్థులు

» రాష్ట్రస్థాయికి ఎంపికైన దివ్యాంగ విద్యార్థి


జిల్లాలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

లింగంపేట, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు జిల్లా స్థాయిలో తమ ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి శివకుమార్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీల్లో పాల్గొని జావెలింగ్ త్రో, షాట్‌పుట్‌లలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాలో మొదటి స్థానం సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జీ ప్రధానోపసాధ్యాయుడు వాహెద్ సిద్దీఖీ తెలిపారు. చెకుముకి పోటీలలోను పాఠశాలకు చెందినవిద్యార్థులు తెలుగుమీడియంలో పోతరాజు, మణితేజ, బాణుప్రసాద్‌లు తెలుగుమీడియంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించగా, ప్రతీక్‌గౌడ్, లక్ష్మన్‌యాదవ్, రాంచరణ్‌లు ఇంగ్లీష్‌మీడియంలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ఆయన తెలిపారు. వీరిని ఎంఈవో శౌకత్ అలీ అభినందించారు.

సుధాకర్ కుటుంబానికి జాగృతి అధ్యక్షురాలు కవిత ఆర్థిక సహాయం


దేవునిపల్లిలో గొర్రెల కాపరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవిత

కామారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి దర్శపు సుధాకర్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుంటు సభ్యులకు రూ. 11 వేల ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా పిల్లలు చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయామని అదుకోవాలని ఆమెను కుటుంబ సభ్యులు వేడుకున్నారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గొర్రెల కాపరి సుధాకర్ భార్య రజితకు ఎదైన జాబ్ ఇప్పించాలని వేడుకోగా జాబ్ ఇప్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలు ఎంత వరకు చదువుకున్న వారికి అయ్యే ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

ఉచిత విద్యను అందించేందుకు కృషి చేసిన మహనీయుడు పూలే


పూలే విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు అందరికి ఉచిత విద్యను అందించేందుకు జ్యోతిరావు బాపూలే కృషిచేశారని బీసీ జేఏసీ నాయకులు నీల నాగరాజు, కుంబాల లక్ష్మన్‌యాదవ్‌లు అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులనిర్మూలన కావాలని ఆనాడే సత్యశోదక్ సమాజాన్ని నిర్మించి వివాహాలను జరిపించారని తెలిపారు. సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడడాని అన్నారు.భారతదేశంలో ప్రతీ ఒక్కరు పూలే ఆలోచన విధానాన్ని కొనసాగించే దిశగా ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దిరాములు, వినోద్‌నాయక్, సాయికృష్ణ, గంగారాం, సుశీల, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో ఫ్రైడే.. డ్రైడే


భిక్కనూరులో నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

భిక్కనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి వెళ్లి కొబ్బరి చిప్పలు, టైర్లు, కుండీల్లో, తదితర వాటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా వైద్యురాలు దివ్య మాట్లాడుతూ నీటి కుండీలను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉంటే డెంగ్యూ, మలేరియా వ్యాధుల భారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో వెంకటరమణ, హెల్త్ సూపర్ వైజర్లు రాజమణి, సువర్ణ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు దోమకొండలో క్రికెట్ పోటీలు

కామారెడ్డిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ -14 బాలురకు క్రికెట్ పోటీలు దోమకొండ మండల కేంద్రంలోని ఆనంద్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హిరాలాల్ తెలిపారు. క్రీడాకారులు ఒర్జినల్ బోనఫైడ్‌తో పాల్గొనాలని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారు కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సర్పంచ్ ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌కు షాక్

» పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న విండో చైర్మన్ రాజాగౌడ్

భిక్కనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు భిక్కనూరు మండలంలో గట్టి దెబ్బ తగిలింది. మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ రాజాగౌడ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో 30మంది అనుచరులతో చేరారు. వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా క ప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా గత 30ఏళ్లుగా మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌తో అనుచరుడిగా ఉన్నాడు. కాగా సర్పంచ్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా నాయకులు, కార్యకర్తలు వెళ్లడంతో పెద్దమల్లారెడ్డిలో రాజకీయం ఒక్కసారిగా రసవత్తరంగా మారింది. రాజాగౌడ్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయనున్నాడు. రాజాగౌడ్‌తో పాటుగా సతీష్‌రెడ్డి, బాబాగౌడ్, వెంకట్‌స్వామిగౌడ్ ఉన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కే రాంప్
ప్రియ 35- దా ఎపిక్
దర్శన్- జటదార

బాన్సువాడ

మహేశ్వరి మాస్ జాతర
వెంకటేశ్వర బాహుబలి (ది ఎపిక్)

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

కొనుగోలు కేంద్రాల్లో వసతులు నిల్

(5వ పేజీ తరువాయి)

కేంరాజ్ కల్లాలి, మందబాద్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులు కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యం తీసుకు వచ్చినప్పుడు రైతులు విశ్రాంతి తీసుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు ఎండలు ఉండడంతో ఆలనే ఎండలో నిల్చుండి రైతులు వరుస క్రమంలో ధాన్యపు కంటలు పెట్టుకుంటున్నారు. కేంద్ర నిర్వాహకులు ధాన్యం కాంటా చేసేటప్పుడు ఐకేపీ సిబ్బంది సొసైటీ సిబ్బంది కేంద్రాల్లో ఉండడం లేదు. హమాలీలు ధాన్యం కాంటాలు వేసి లారీ నింపిన తర్వాత నిర్వాహకులు కేంద్రాలకు వచ్చి రైతుల వారీగా వివరాలు సేకరించి ట్రక్ షీట్ రాస్తున్నారు. రైతులతో కలిసి రైస్‌మిల్‌కు వెళ్లాల్సిన సిబ్బంది వెళ్లకుండా వారి ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని రైతులు ఆగ్రహం చెందారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కేంద్రాలకు చుట్టపు చూపుగా వస్తూ కాలక్షేపం చేస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల సిబ్బందిపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని రైతులు అధికారులు కోరుతున్నారు.

రెండో రోజు 853 నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)

1520 వార్డు స్థానాలకు గాను 600 నామినేషన్‌లు వచ్చాయి. భిక్కనూరు మండలంలో 18 సర్పంచ్ స్థానాలకు గాను 30 నామినేషన్‌లు దాఖలు కాగా 182 వార్డులకుగాను 96 నామినేషన్‌లు వచ్చాయి.బీబీపేటలో 11 సర్పంచ్ స్థానాలకు 21, 110 వార్డుస్థానాలకు 33నామినేషన్‌లు రాగా,దోమకొండలో 9 స్థానాలకు గాను 21, 96 వార్డులకు 77 నామినేషన్‌లు రాగా, కామారెడ్డిలో 14 సర్పంచ్ స్థానాలకు 15, 120 వార్డు స్థానాలకు 47,మాచారెడ్డిలో 25 సర్పంచ్ స్థానాలకు 36, 196 వార్డులకు 58,పల్వంచలో 12 సర్పంచ్ స్థానాలకు 18, 110 వార్డులకు 41,రాజంపేటలో 18 సర్పంచ్ స్థానాలకు 36, 158 వార్డులకు 66, రామారెడ్డిలో 18 సర్పంచ్ స్థానాలకు 32, 166 వార్డులకు 66, సదాశివనగర్‌లో 24 సర్పంచ్ స్థానాలకు 32, 214 వార్డులకు 67, తాడ్వాయిలో 18 సర్పంచ్ స్థానాలకు 22, 168 వార్డు స్థానాలకు 49 నామినేషన్‌లు వచ్చాయి.

ప్రధాన పార్టీల్లో బీసీ కుంపటి

(5వ పేజీ తరువాయి)

కాదని వారు ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రతిపక్ష పార్టీలు అనుకూలంగా మార్చుకునే అవకాశాలు ఉండడంతో అధికార కాంగ్రెస్ అచితుచిగా వ్యవహరిస్తోంది.

సవాల్‌గా అభ్యర్థుల ఎంపిక

గ్రామ పంచాయతీల్లో పార్టీ రహిత ఎన్నికలు జరుగుతున్న ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేయడం సాధారణ విషయం. కానీ అధికార పార్టీ అనధికార బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించడంతో ఇది క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇదివరకే జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే కోర్టు కేసు కారణంగా అమలులోకి రాలేదు. కానీ పార్టీ పరంగా రిజర్వేషన్‌లు కల్పించేందుకు కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఇతర పార్టీలు కూడా బీసీలకు పెద్ద సంఖ్యలో కేటాయిస్తామని ప్రకటించాయి. ప్రధానంగా జనరల్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక అధికార పార్టీ నాయకులకు సవాల్‌గా మారింది. పార్టీ పరంగా బీసీ రిజర్వేషన్‌లు అమలు చేస్తే జనరల్ స్థానాల్లో బీసీలకు కేటాయించాల్సిన పరిస్థితి ఉంది. సాధారణంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయంతో ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. అటు అధికార ఇటు ప్రతిపక్ష పార్టీలకు అనధికార రిజర్వేషన్‌లు సవాల్‌గా మారుతున్నాయి.

వరి తేమ శాతం ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని, గంగమ్మ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ మేరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామ పంచాయతీల్లోని వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, కౌంటర్‌లోనికి అధికారులు నామినేషన్లు సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మండలంలోని గంగమ్మ బ్రిడ్జి మరమతు పనులను వేగవంతం చేయాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఉమాలత, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, ఆర్ అండ్ బీ ఈఈ మోహన్, ఏఈఈ రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: భూ భారతి, రెవెన్యూ సదస్సుల పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీసీలో జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో మాట్లాడారు. మండలాల వారిగా వచ్చిన దరఖాస్తులు పరిష్కారం, పెండింగ్, నోటీసులు జారీ చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సాదాబైనామ దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో స్పష్టమైన వివరణాత్మక కారణాలను తప్పని సరిగా నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే మంజూరు జాబితాలను పంపాలని తెలిపారు. ఆధార్ కోసం అవసరమైన విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలను అత్యంత త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఏవో అహ్మద్, సూపరింటెండ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

(5వ పేజీ తరువాయి)

విద్యారంగాన్ని అధోగతి పాలు చేస్తుందన్నారు. సైంటిఫిక్ విధానాలను తొలగించి మూఢత్వం, మత చాందస విధానాలను ప్రవేశపెట్టి దేశ ప్రజలను అజ్ఞానులుగా చేయడానికి కంకణబద్ధులు అవుతున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో మతపరమైన చర్యలు తీసుకుంటూ ప్రగతిశీల భావాలను రూపు మాపుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానాలకు వ్యతిరేకంగా కామారెడ్డి మహాసభలను స్ఫూర్తిగా తీసుకుని సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టి రెండేళ్లయినా సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగం సమస్య పరిష్కారంపై దృష్టిసారించడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యదర్శి ప్రభాకర్, రామకృష్ణ, మాజీ పీడీఎస్‌యూ నాయకులు పద్మారావు, శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛత, హరితలో బోర్లం పాఠశాలకు ద్వితీయ స్థానం

బాన్సువాడ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛత ఏవం పాఠశాల 94.40శాతం స్కోరింగ్‌తో 5స్టార్ రేటింగ్ సాధించడంతో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచి శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం వెంకటరమణ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పాఠశాలలో పారిశుధ్యం, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై పాటిస్తున్న ప్రమాణాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, వీఈటీ శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.